# పాత్రికేయుల బ్రతుకుబరువు

ఓగేటి శివరామకృష్ణ

పెనుగొండ పట్టణంలో ఉన్న పత్రికా రచయితలంతా తమ ఆదర్శ సాహితి తరఫున ఒక సభ యేర్పాటు చేశారు. ఆసభలో చర్చనీయాంశం ప్రజోపయోగకరమైన విషయంగురించి మాత్రంకాదు. తమ స్వంత లాభంకోసం యేర్పాటుచేసుకొన్న సభ అది. మరి చర్చనీయాంశం పత్రికా రచయితల కష్టనిష్ఠూరాల గూర్చి.

కుక్క గొడుగుల్లా ఉద్భవించిన యీ రచయితలతోటే ఆ పట్టణంలోనే యేర్పడింది 'కాంతి' అన్న పేరుతో పక్ష పత్రిక. అయితే పక్ష పత్రిక అన్నమాటేగాని యించుమించు నెలమీద అయిదురోజుల తర్వాత ఓ సంచిక రూపంలో అది తయారయి వస్తూ ఉంటుంది.

దాని సంపాదక సార్వభౌముడుకూడా మన రచయితల సంఘంలోవాడే. అందువల్ల మన పత్రికా రచయితల సంఘం తరఫున-మరచా-మన్నించండి-ఆదర్శ సాహితి తరఫున యేర్పాటు చేసుకోబోతున్న సభకు పై సంపాదకుల వారాహ్వానించటం, వారు దయతో అంగీకరించటం జరిగాయి.

అయితే ముందు యే విషయమైనా చర్చకు తీసుకుని రావాలంటే దానికిముఖ్యంగా పసంతా డబ్బుతోనే. అయితే యీ ఆదర్శ సాహితి తరఫున ఎర్రనియేగాణి కూడా నిలువలేదు. మరి సభ యేర్పాటు చేసుకొనేటప్పుడు 'తేనీరు' ఏర్పాటు చేయకపోతే బాగుండదు. ఎల్లాగా అని ఆలోచనచేసి చివరకు సమితిలో ఉండే ప్రతీ సభ్యుడూ తలో అర్ధరూపాయి వేసుకొని తేనీటి విందు యేర్పాటు చేసుకొందా మనుకొన్నారు. సరే అందులో ఒకరో, యిద్దరో తగ్గినా, మొత్తంమీద అధిక సంఖ్యాకులు ఆవిధంగా చేయటానికి అంగీకరించటంవల్ల, వసూలు చేయటం ప్రారంభించారు. ఎలాగో డబ్బు వసూలయింది, మరి సభకేం అడ్డు-ప్రత్యేక పత్రికా రచయితల సభ-అందులోనూ సాహితీవేత్తల సభ అంటే బయటవాళ్ళు యెవరూ రారుగా! రావలసిన అవసరంకూడా ఉండదుగా!

సరే. కార్యక్రమ ప్రకారం ముందు తేనీటి విందు. ఎవళ్ళిచ్చిన డబ్బుకో వాళ్ళే యించుమించు తిన్నట్టన్నట్టు, చందా యిచ్చిన సభ్యులెవరూ బాధపడినట్టు కన్పడలేదు. పైకిమాత్రం 'మన సమితికోసం మన రచయితల సంఘంకోసం మరిమరి మనం యీలాంటి సభలు యెన్ని పెట్టుకోవాలో మనం ఎంత ముందడుగు వెయ్యాలో' అని అనుకొన్నారు.

సభ యేర్పాటు జరిగింది. ఉన్న పది, పదిహేను మంది సభ్యులూ చాపలమీద కూర్చున్నారు. అధ్యక్షులకు గౌరవంగా ఒక యెత్తయిన ఆసనంవేసి తమ అభిమానాన్ని వెలిబుచ్చుకొన్నారు.

అధ్యక్షులవారు తమ ప్రథమోపన్యాసంలో యీవిధంగా మాట్లాడారు. 'సోదర రచయితలారా! నేడు మీకూ నాకూ సుదినం. ఎందువల్లనంటే ముఖ్యంగా అయిక్యతతో ఒక విషయం గురించి చర్చించటంకోసం నిలబడటం! 'మన' ఆదర్శ సాహితి మన 'కాంతి' వారాల వరలా ముందడుగువేసి, మన పేరు నలుమూలలా వ్యాపింపచేస్తూన్నాయి. అయితే, ప్రస్తుతం - చర్చనీయాంశం అది కాదనుకోండి-పత్రికా రచయితల కష్టనిష్ఠూరాలగూర్చి పత్రికా రచయితలుగా మీకూ సంపాదకులుగా మాకూ తగనన్ని బాధ్యతలూ కష్టాలూ ఉంటాయి. వాటిని సక్రమంగా మన సమితి నిర్వర్తిస్తూన్నా యితరు లెవరూ నిర్వర్తించటం లేదు. అందువల్ల ముందు మనమూ అటుంచి యెందు వల్లనంటే - మనలో మనకు యేలాంటి కష్టాలున్నా సుఖాలున్నా అంతా ఒకటే గనుక భరించటం భావ్యం - పరాయివారి పట్ల అలా భరించటం యేం న్యాయమో చెప్పండి. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. చర్చనీయాంశాలు ముందు జరిగిపోతే తరువాత నే మాట్లాడ వల

సింది. రెండు ముక్కల్లో చెబుతా. ముందు మీ సమితి తరఫున-మీ రచయితలంతా మీ కష్టాలు తెల్పుకొంటే - యేదో సంపాదకుడిగా నాకు తెలిసినది చెప్పడానికి ప్రయత్నిస్తా. మరి ఇంతటితో ఒక్కరొక్కరే లేచివచ్చి మాట్లాడితే బాగుంటుంది' అని.

అధ్యక్షులు అలా అనటమే తడవుగా ఒక్కొక్క రచయితే వచ్చి తమ కష్టములు చెప్పుకోవడం మొదలు పెట్టారు. ఒక రచయిత యీ విధంగా అన్నాడు: ఈ రోజుల్లో పత్రికకు వ్యాసముల రూపంలో సహాయం చేస్తున్న మనల్ని పత్రికా సంపాదకులు సరిగా చూడటం లేదు సరిగదా సరియైన ప్రోత్సాహం కూడా కల్గనీయటం లేదు——

ఇంకో రచయిత లేచి అనసాగాడు: ఏమిటో మా సఖ్యం అప్పుడే ప్రోత్సాహందాకా ఉద్దేశాన్ని పోనిచ్చాడు. అసలు పత్రికా సంపాదకులు-ఆ స్థానం పొందటంతోటే తమేదో పెద్ద ఎత్తైన సింహాసనం మీద కూర్చున్నామనుకొంటారు గాని రచయితల గురించి ఒక్కసారయినా తలచరు. అలాంటి వళ్ళు తెలియకుండా మసలుకొనే వారికి రచనలుయిచ్చి మరి, మనల్ని మనం మోసం చేసుకొనటం దేనికి? ఇక నుంచయినా మరి పత్రికలకు రచనలు యివ్వకుండా మన యీ రచయితల మంతా కలసి ఒకసెటిల్మెంటుకు రావాలి. అప్పటికి గాని వారికి కళ్ళు క్రిందకు రావు. అప్పుడుగాని వాళ్లస్థితి వాళ్ళకు తెలియదు.

మరో రచయిత లేచి యీవిధంగా అన్నాడు: 'నా మిత్రుడు శ్రీ శాస్త్రి చెప్పిన మాటలు చాలావరకు నిజం. పోనీ యేదో మనమూలకంగా బ్రతుకుతున్నారే వాళ్ళు- మన మాటకు, కొద్దో గొప్పో విలువ ఉంచాలా? మన ఉత్తరాలకు ప్రత్యుత్తరా లివ్వాలా? అదేమిటో కొంతమంది అధిపతులు యెన్ని ఉత్తరాలు వ్రాసినా జవాబులు యివ్వనే యివ్వరు.

వేరొక రచయిత లేచి యిలా చెప్పసాగాడు: నా మిత్రులు మాటాడిన మాటలన్నీ యథార్థాలు. వళ్ళు తెలియక మసలుకొంటారు సంపాదకులు. చిట్ట చివరకు యేదున్నా యేమి లేక పోయినా ప్రచురించబడిన పత్రికనయినా సక్రమంగా యివ్వని ఆ సంపాదకులు మనకు చేస్తున్న మేలేమిటి - అలాంటి వారికి మనం యెందుకు సహాయం చెయ్యాలి?- ఇంకా దారుణం ప్రచురణ కిచ్చిన వ్రాతల్లో రచయిత తన స్వాతంత్ర్యం ఉపయోగించుకుంటే 'వీల్లేదు' అన్నట్లుగా యేమిటో వారి శక్తి కొద్దీ కొన్ని వాక్యాలు పీకి వ్యాసాన్ని జీవచ్ఛవం చేస్తారు.'

ఇలా కలుమంది పలువిధాలుగా మాట్లాడారు. అయితే మొత్తం వున్న సభ్యులందరిలోకీ ఒక్కగానొక్కరు మాత్రం వారికి ప్రతికూలంగా వాదించారు - ఆయన వాదనా వాక్యాలివి: మీరు చెప్పిన మాటలు చాలా అసత్యం. పత్రికాసంపాదకులు మనవిధి మనం నిర్వర్తించుకొంటూంటే సక్రమంగా, వాళ్ళూ వాళ్ళ విధి సక్రమంగా నిర్వర్తించుకొంటారు. మనం అడ్డదారి త్రొక్కుతూంటే గత్యంతరం లేక వాళ్లూ అలాగే త్రొక్కుతారు. నిజంగా నా అనుభవంమీద చెబుతున్నా. వాళ్లు స్నేహితులూ ఆప్తబంధువుల కంటె హెచ్చుగా మన యోగక్షేమాలు కనుక్కొంటూ ఉంటారు. రచన రచనకూ యేదో ప్రతిఫలం అందిస్తూ యుంటారు. వాళ్ళు తగిన సలహాలిస్తూంటే వాటిని పాటిస్తూంటే వాళ్ళ అభిమానానికి మనం పాత్రులౌతాము. అంతేకాని యిష్టమొచ్చినట్లు అసందర్భంగా రచయిత వ్రాసిన వాక్యాలు తీసెయ్యరు. అవి అశ్లీలంగానో, అసందర్భంగానో ఉండియుంటాయి. ఇంతకంటె మరి నే చెప్పలేను.'

ఆయన మాట్లాడీ మాట్లాడటంతోనే మిగిలినవాళ్ళంతా అతనికేసి చూసి ఫక్కున నవ్వారు. అధ్యక్షులు కూడా నవ్వనవ్వకుండా యున్నట్లు నటించారు. 'ఓ యీనాటికి బయలుదేరావ్... నువ్వొక్కడవే... గౌరవ మర్యాదలు పొందుతున్నవాడవ్... అయితే నీకు గెక్కు పుష్పవీథుల్లో తిరగటం యెప్పుడూ' అని హేళన చేశారంతా!

మరి మాట్లాడేవాళ్లెవరూ లేకపోవటంవల్ల అధ్యక్షులు లేచి యీ విధంగా తమ తుది ఉపన్యాసంలో అన్నారు: 'అంతా అన్ని విధాలా సవిస్తరంగా మాట్లాడారు. మరి నే మాట్లాడవలసింది లేదు. ఎలాగయినా పేరయ్య

గారు చెప్పిన మాటలు తీసివేయ నవసరం లేదు. రచయితలు సక్రమంగా ఉంటే సంపాదకులు కూడా మిమ్మల్ని సక్రమంగానే చూస్తారు. అయితే ఎలాగయినా యిక్కడ మెజారిటీయే యెక్కువయింది. పేరయ్యగారూ నేనూ మాట్లాడటంవల్ల ప్రయోజనం లేదు! మీరు ప్యాసు చేసే రిజల్యూషను ఓసారి చదివేస్తే సభ ముగిసినట్లే.'

నవ్వుతూ 'ఆదర్శసాహితి' సెక్రటరీ అధ్యక్షుల ప్రక్కనే నిల్చుని యీ విధంగా తమ రిజల్యూషను చదివాడు: ఈ దినం... అంటే యీరోజే... 'ఆదర్శసాహితి' కాంతి సంపాదకుల అధ్యక్షతను రచయితల కష్టనష్టాలను గూర్చి విపులంగా చర్చించి యీ దిగువ తీర్మానములు చేసినది. ఇవి అన్ని పత్రికలవారూ ఆచరించుట మంచిదని వారి శ్రేయస్సు కోరి తెల్పటమయినది:

1. పత్రికా సంపాదకులు, తామూ ముందు రచయితలమని అనుకోవాలి. తాము సంపాదకులమనే 'అహం' మనస్సులో ఉంచుకోనకుండా రచయిత విధంగానే ప్రక్క రచయితతో మసలుకోవాలి. గౌరవభావాలతో మసలుకోవాలి.

2. వ్రాసిన విషయాల్లో అసభ్యత ఉండేలా రచయిత ఎప్పుడూ వ్రాయడు. అందువల్ల అలా వాక్యాలు తీసేసి రచయిత స్వేచ్ఛకు భంగం కలిగించకూడదు.

3. రచయిత వ్రాసిన ప్రతీ ఉత్తరానికి మరి యోచించకుండా వెంటనే సక్రమమైన జవాబు యివ్వాలి. వ్రాసిన రచనలకు సరియైన ప్రతిఫలం యెప్పటికప్పుడు యిస్తూండాలి.

4. సంవత్సరం ఆఖరున పత్రికకు వచ్చే లాభాలను రచయితలకు సమానంగా 'బోనస్' రూపంగా పంచి యివ్వాలి.

5. రచయితకు తన బాధ్యతలు తనకు తెలుసు గనుక సంపాదకులు వానికి సలహాలను యివ్వరాదు. అలా సలహాల నివ్వటం కేవలం రచయితల నవమానపరచటమే!

'—ఇంతే – మరేమైనా ఉంటే వ్రాస్తా' అన్నాడు సెక్రటరీ.

'మరేం లేవు' - అన్నారు అంతా—.

'ఇవి ఏకగ్రీవామోదం అనుకోవచ్చా' — అన్నాడు సెక్రటరీ.

'అన్నమాటే'—అన్నారు అధ్యక్షులు కుర్చీ లోంచి లేస్తూ.

'మెజారిటీ లేనప్పుడు ప్రయోజనమేమిటి నీకు?' అంటూ హేళనచేశాడాయన ప్రతికూలుడ్ని!

మొత్తంమీద అంతటితో సమావేశం అంతమయింది. తీర్మానాలను ప్రతీ పత్రికకు ప్రకటనకు పంపించారు. అయితే నెల రోజు లయింది అప్పుడే-గాని యింతవరకూ యే పత్రికా ఆదర్శ సాహితి తీర్మానాలు మాత్రం ప్రచురించలేదు!

జీవితంలో మరుపు ఒక అమూల్యమైన వరం. భౌతిక, మానసిక, అధ్యాత్మిక వ్యవహారాలన్నిటిలోనూ ఒడిదుడుకులు లేకుండా గడపాలంటే, జ్ఞాపకం ఉంచుకునే శక్తి ఎంత అవసరమో, మరిచి పోగలిగే శక్తి అంతే అవసరం.

మనకి అమితమైన చిరాకు కలిగించే విషయాలు తెల్లారిలేస్తే అనేకం జరుగుతూ ఉంటాయి. అవి జరిగిన ఉత్తరక్షణం మనం వాటిని మరిచి పోవడం మంచిది. మనస్సు ఎప్పుడూ మనకు కలిగిన అవమానాల గురించీ, ఓటమి గురించీ ఆరాట పడుతూంటే, యిక విశ్రాంతి ఎక్కడిది? ఆనందం ఎక్కడిది? ఆత్మ విశ్వాసం ఎక్కడిది?

మరిచిపోగల్గే శక్తి కూడా ఒక కళ అని ప్రతివ్యక్తీ సర్వదా జ్ఞాపకం ఉంచుకోవాలి. అప్పుడే జీవిత ప్రయాణం సులభంగా చెయ్య గల్గుతాం..